## క్లుప్తంగా

### అంగవైకల్యం ప్రతిభకు అడ్డుకాదు



చేబ్రోలు: అంగవైకల్యం ప్రతిభకు అడ్డుకాదని, వారిపై సానుభూతి చూపకుండా, మనోధైర్యం నింపాలని చేబ్రోలు ఎంఈఓ- 1 ఏవీహెచ్ ప్రసాద్ అన్నారు. మండల కేంద్రమైన చేబ్రోలులోని భవిత కేంద్రంలో విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం నిర్వహించారు. ఈ నెల 3వ తేదీన నిర్వహించ వలసిన వేడుకలను తుఫాన్ కారణంగా వాయిదా వేయటంతో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ-2 ఆర్.సుబ్బారావు మాట్లాడుతూ భవితా కేంద్రంలో అందించే సేవలను ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. డిసెంబరు 2వ తేదీన విభిన్న ప్రతిభావంతులకు నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. వివిధ గ్రామాలకు చెందిన కొంతమంది సీడబ్ల్యూఎస్ఎన్ పిల్లలకు సదరం సర్టిఫికెట్లు, టీఎల్ఎం కిట్లను అందజేశారు. ఐఈఆర్టీ టీచర్స్ జి.అనూరాధ, జి.రాజేష్ దినకర్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### కిట్స్ అధ్యాపకునికి డాక్టరేట్



ప్రత్తిపాడు: కిట్స్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్ విభాగం అధ్యాపకుడిగా పనిచేస్తున్న మెట్లపల్లి అయ్యప్ప చక్రవర్తికి డాక్టరేట్ లభించింది. యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.తిల్లైకరాశి, డాక్టర్ భానుప్రకాష్ బత్తుల పర్యవేక్షణలో 'ఎ ఫ్రేమ్ వర్క్ ఫర్ క్లాసిఫికేషన్ ఆఫ్ స్పామ్ డేటాయిజింగ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ మోడల్స్' అనే అంశంపై అయ్యప్ప చక్రవర్తి చేసిన పరిశోధనకు తమిళనాడు రాష్ట్రం చిందంబరంలోని అన్నామలై యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈ సందర్భంగా చక్రవర్తిని స్థానిక కళాశాలలో కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు, కార్యదర్శి కోయి శేఖర్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబులు అభినందించారు.

### విద్యుత్ శాఖ అధికారుల ఆకస్మిక తనిఖీ

తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ నిఘా విభాగం ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు సీఆర్డీఏ సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ డాక్టర్ ప్రత్తిపాటి విజయకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 3370 సర్వీసులను తనిఖీ చేయగా, వారిలో అనుమతి పొందిన లోడ్ కంటే ఎక్కువగా లోడ్ వినియోగించుకుంటున్న గృహ, వాణిజ్య, పారిశ్రామిక సర్వీసుల్లో 70 మందిని గుర్తించి, వీరి వద్ద నుంచి రూ.3,32,600 వసూలు చేశామని చెప్పారు.

### ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



పొన్నూరు: పట్టణంలోని 23వ వార్డు పాత పొన్నూరు మున్సిపల్ కమ్యూనిటీ భవనం ప్రాంగణంలో మంగళవారం పాస్టర్స్ యూనివర్సల్ క్రిస్టియన్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముఖ్యఅతిథిగా విజయవాడకు చెందిన ప్రసంగికులు సీహెచ్ డేవిడ్ బ్రెస్‌హం పాల్గొని వ్యాఖ్యోపదేశం చేశారు. క్రీస్తు పుట్టుక, విశేషాలను భక్తులకు వివరించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన క్రీస్తు పుట్టుక నాటిక విశేషంగా ఆకట్టుకుంది. చింతల చౌదరి, రుద్రపాటి పౌలేష్, పాస్టర్ కొండ్రు కొండ్రునాని, సీహెచ్ శ్యాంప్రసాద్, పి.అనిల్ కుమార్, జి.జాన్ వెస్లీ, ఎం.శామ్యూల్, వివిధ చర్చిల పాస్టర్లు, సంఘ పెద్దలు, యూత్ సభ్యులు, మహిళా సమాజం సభ్యులు, క్రైస్తవ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.

**కల్వరి టెంపుల్‌లో..**

పెదకాకాని: లోక రక్షకుడైన ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయమని కల్వరి టెంపుల్ వ్యవస్థాపకులు సతీష్‌కుమార్ అన్నారు. పెదకాకాని సమీపంలోని నంబూరు కల్వరి టెంపుల్‌లో మంగళవారం రాత్రి సెమీ క్రిస్మస్, నూతన సంవత్సరం పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఈ వేడుకలకు మంత్రి ఆదిమూలపు సురేష్, కిలారి వెంకటరోశయ్యలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అధికసంఖ్యలో తరలివచ్చిన భక్తులకు కల్వరిటెంపుల్ వ్యవస్థాపకులు సతీష్‌కుమార్ క్రిస్మస్ సందేశాన్ని అందించారు. దేవుడు ప్రసాదించిన జ్ఞానాన్ని, ఆనందాన్ని, ఘనత, ఆత్మీయత, ఆరోగ్యాన్ని, ఆర్థిక, బలాన్ని ప్రతి ఒక్కరూ అనుభవించాలన్నారు. నూతన సంవత్సరంలో భక్తులు ఆశించిన ప్రతి దీవెనను దేవుడు ప్రసాదించాలన్నారు. అనంతరం సెమీ క్రిస్మస్ కేక్ కట్ చేసి భక్తులకు పంచిపెట్టారు. అతిథులుగా హాజరైన మంత్రి ఆదిమూలపు సురేష్, కిలారి వెంకటరోశయ్యలు ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- పచ్చలతాడిపర్రు, పొన్నూరుల్లో 'వై ఏపీ నీడ్స్ జగన్'
- ఇంటింటి ప్రచారం నిర్వహించిన ప్రజాప్రతినిధులు, నాయకులు

పొన్నూరు: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇంటింటికి సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నారని జెడ్పీటీసీ కర్లపూడి రమేష్ అన్నారు. మంగళవారం మండలంలోని పచ్చలతాడిపర్రు గ్రామంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. సెంటర్లోని వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. ప్రతి ఇంటికి తిరిగి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను ఇంటింటికి తిరిగి వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం గ్రామ సచివాలయంలో గత నాలుగున్నరేళ్ల కాలంలో గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారివివరాలతో ప్రదర్శించిన బోర్డును ఆవిష్కరించారు. ఎంపీపీ భవనం పద్మలీల, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పెరికల కృష్ణమోహన్, పార్టీ మండల అధ్యక్షుడు రుద్రపాటి ఆదిశేషులు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, నాయకులు సర్దార్, మనోహర్, దాసరి శివరామకృష్ణ, నాగప్రసాద్, సచివాలయ సిబ్బంది వలంటీర్లు పాల్గొన్నారు.

**పొన్నూరు పట్టణంలో..**

పట్టణంలోని 23వ వార్డులో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు వార్డులోని ఇంటింటికి తిరిగి పట్టణంలో గత నాలుగున్నరేళ్లలో జరిగిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం వార్డు సచివాలయంలో సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలతో ప్రదర్శించిన బోర్డును



పచ్చలతాడిపర్రులో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆవిష్కరించారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎంఏ మహమ్మద్, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు బొద్దులూరి రంగారావు, నాయకుడు కె.శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

**జగనన్నద్వారానే సంక్షేమం, అభివృద్ధి..**

గుంటూరు రూరల్: జగనన్న ద్వారానే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని అర్బన్ క్లస్టర్-2 కన్వీనర్ బండారు శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం 47వ డివిజన్ గోరంట్ల వైఎస్సార్ సీపీ కన్వీనర్ జల్లేపల్లి వేణుబాబు ఆధ్వర్యంలో 182వ సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయం పరిధిలో ప్రజలకు ప్రభుత్వం అందజేసిన రూ.27 కోట్ల సంక్షేమ పథకాల పట్టికను ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి తిరిగి ప్రభుత్వం ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించి ప్రజా అభిప్రాయ సేకరణ చేశారు. వైఎస్సార్ సీపీ నేతలు ప్రసాద్, రాచకొండ ముత్యాల రాజు, దుంపాల రాధ, జేసీఎస్ కన్వీనర్ పిల్లి నాగేశ్వరరావు, లక్ష్మి, చిన్నా పాల్గొన్నారు.



గుంటూరు రూరల్ 47వ డివిజన్‌లో పథకాలు వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

**జగనన్న పాలనలో ఇంటింటా సంక్షేమం..**

ప్రత్తిపాడు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎంపీపీ దాసరి అన్నమ్మ అన్నారు. మండల పరిధిలోని తిక్కిరెడ్డిపాలెంలో మంగళవారం పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈఓపీఆర్డీ మావులూరి మోషే ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్ సచివాలయ పరిధిలో క్లస్టర్ వారీగా జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, లబ్ధిదారులు, డీబీటీ, నాన్‌డీబీటీల ద్వారా చేకూరిన లబ్ధి వివరాలను వెల్లడించారు. అనంతరం సచివాలయంలో సంక్షేమ పథకాల లబ్ధిదారుల ప్రదర్శన బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మరోసారి ముఖ్యమంత్రిగా జగనన్నను ఎన్నుకోవడం చారిత్రక అవసరమన్నారు. సచివాలయాల మండల కన్వీనర్ వేలూరి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండుకళ్లుగా జగన్ పాలన సాగిస్తున్నారని చెప్పారు. ఎస్సీసెల్ మండల కన్వీనర్ ఏసు, సచివాలయ కన్వీనర్ అనిల్, మామిడి అశోక్, ప్రత్తిపాడు ఉపసర్పంచ్ బాపతు వెంకటేశ్వరరెడ్డి, ప్రత్తిపాడు గ్రామ అధ్యక్షుడు గుజ్జుల శివారెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

గుంటూరు రూరల్: ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రతి ఒక్కరికి కార్పొరేట్ స్థాయి వైద్యం అందించటంతో పాటు, ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కృషిచేస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని అనారోగ్య బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో ప్రతి కుటుంబం సంతోషంగా ఆయురారోగ్యాలతో జీవిస్తున్నారన్నారు. అనంతరం చినపలకలూరు గ్రామానికి చెందిన గణితి గోపికి రూ 4.లక్షలు, కాకుమాను గ్రామానికి చెందిన కొల్లా రమేష్‌బాబుకు రూ 2.50 లక్షలు, పలుగూరి సదాశివరావుకు రూ 2.20 లక్షలు, యనమదల గ్రామానికి చెందిన దేగల నాగరాజుకు రూ 2.20 లక్షలు, కొప్పర్రు గ్రామానికి చెందిన అంకం అనూరాధకు రూ 1.20 లక్షలు, బీకే పాలెంకు చెందిన కాండ్రు సుగణకు రూ 56,000 మొత్తం రూ.11,11,000ల చెక్కులను బాధిత కుటుంబాలకు అందజేశారు. కేవలం పత్తిపాడు నియోజకవర్గంలోనే నేటివరకు ప్రజల ఆరోగ్య అవసరాలకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులుగా రూ.10,17 కోట్లు పంపిణీ చేయటం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందుకున్న బాధిత కుటుంబాలతో ఎమ్మెల్యే సుచరిత

### ఆర్ఐ సలాంకి చార్జి మెమో జారీ

నెహ్రూనగర్: గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలోని చౌడవరం దగ్గర గల స్పీడ్ వే, సక్కు కోళ్ల ఫారాలకు 2012 నుంచి పన్నులు వేయకుండా 2021వ సంవత్సరం పన్ను వేయటం ద్వారా కార్పొరేషన్ ఆదాయానికి రూ.కోటి గండి పడిన విషయం తెలిసిందే. ఈ విషయంపై 5వ డివిజన్ కార్పొరేటర్ రవి సోమవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావించారు. దీనికి స్పందించిన కమిషనర్ కీర్తి చేకూరి ఆ సమయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన సలాంకి చార్జి మెమో జారీ చేశారు.

### 22న పీడీఎస్ఓ-ఎన్‌వైఎస్ రాష్ట్ర సదస్సు

గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేటలోని వైన్ డీలర్స్ కల్యాణ మండపంలో ఈనెల 22న పీడీఎస్‌ఓ-ఎన్‌వైఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని పీడీఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.భాస్కర్ తెలిపారు. మంగళవారం జిల్లాకోర్టు ఎదుట ఉన్న ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో రాష్ట్ర సదస్సు పోస్టర్లు ఆవిష్కరించారు. ఈసందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ 'విద్యా-ఉపాధి రంగాల సంక్షోభం-పాలకుల విధానాలు-విద్యార్థి, యువజనుల కర్తవ్యాలు' అనే అంశంపై రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నామని వివరించారు. విద్య కార్పొరేటీకరణ, కాషాయీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేసి విద్యాహక్కును సాధించుకోవాలన్నారు. పీడీఎస్ఓ రాష్ట్ర కోశాధికారి ఎల్.భాను, రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎస్.మోహన్, ఎన్‌వైఎస్ జిల్లా నాయకుడు కె.శ్రీను పాల్గొన్నారు.

## ప్రొడిజి విద్యాలయం వార్షికోత్సవం

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదివి ఉన్నత భవిష్యత్తు దిశగా కృషిచేయాలని సీబీఎస్ఈ విజయవాడ రీజినల్ ఆఫీసర్ శేఖర్‌చంద్ర పేర్కొన్నారు. మంగళవారం బుడంపాడు గ్రామంలోని ప్రొడిజి విద్యాలయం 6వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పాఠశాలలో నూతనంగా నిర్మించిన ఇండోర్ స్పోర్ట్స్ స్టేడియాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్య అంటే మార్కులు, ర్యాంకులు ఉదయం నుంచి రాత్రి వరకు స్కూల్, ట్యూషన్ అని భావించి పిల్లలను విపరీతమైన ఒత్తిడికి నెట్టడం కాదని, చిన్నారుల మానసిక, శారీరక, సాంస్కృతిక, సామాజిక వికాసాన్ని పిల్లలలో పెంపొందించడమని తెలిపారు. అటువంటి విద్యను అందిస్తున్న ప్రొడిజి విద్యాలయం యాజమాన్యాన్ని అభినందించారు. పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాల సాధన దిశగా కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా అకడమిక్ టాపర్స్, వివిధ క్రీడలలో జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అతిథులను పాఠశాల యాజమాన్యం అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరింపజేశాయి. పాఠశాల కరస్పాండెంట్ సూర్యకుమారి, పీఈటీ లిల్లిష, బాలభార్గవి, ప్రియాంక, పి.శశి, డి రాజ్యలక్ష్మి, షేక్ నసీమ, వై.భవిష్య, డాన్స్ మాస్టార్లు చిన్న, సన్ని, సాయి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సీబీఎస్ఈ రీజినల్ ఆఫీసర్ శేఖర్ చంద్రను సన్మానిస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

### ర్యాగింగ్ నిషేధంపై కరపత్రం విడుదల

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ర్యాగింగ్ పూర్తిగా నిషేధించబడినదని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ స్పష్టం చేశారు. ర్యాగింగ్ నిషేధంపై మంగళవారం వీసీ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య పి.రాజశేఖర్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం బోధన, పరిశోధనలకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సహచర విద్యార్థులకు ఏదైనా ఇబ్బంది కలిగిస్తే ర్యాగింగ్ కిందకు వస్తుందని, ర్యాగింగ్ జోలికి ఎవరు వెళ్లొద్దని సూచించారు.

# ఈవీఎంల వినియోగంపై అపోహలు వీడాలి

ఈఆర్ఓ హరిహరనాథ్

పొన్నూరు: ఈవీఎంలలో ఓటు వినియోగంపై ప్రతి ఒక్కరూ పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని పొన్నూరు నియోజకవర్గం ఓటరు నమోదు అధికారి (ఈఆర్ఓ) హరిహరనాథ్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవీఎం ప్రదర్శన కేంద్రం, నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు శిక్షణ ఇచ్చే ప్రచార వాహనాన్ని ఈఆర్ఓ ప్రారంభించారు. ఈఆర్ఓ హరిహరనాథ్ మాట్లాడుతూ ఓటర్లు ఈవీఎంల వినియోగంలో అపోహలను వీడాలన్నారు. ఈవీఎంలలో ఒకరికి ఓటు వేస్తే మరొకరికి పడుతుందనే అనుమానాలకు తావివ్వకూడదన్నారు. ఎన్నికల సంఘం ఓటుకు భద్రతనిచ్చేవిధంగా ఈవీఎంలను పటిష్టంగా తయారు చేస్తుందని తెలిపారు. ఈ ప్రదర్శన కేంద్రంలో ఓటర్లు తమ ఓటును ఎలా వినియోగించుకోవాలో శిక్షణ పొందవచ్చు అన్నారు. తహసీల్దార్ కె.శ్రీకాంత్ మాట్లాడుతూ ఈవీఎం, వీవీప్యాట్లలో ఉండే పార్టీల సింబల్స్, అభ్యర్థుల పేర్లను, ఓటు ఎలా వినియోగించుకోవాలో ఓటర్లకు తెలియజేసే విధంగా సిబ్బందికి అవగాహన కల్పించారు. మున్సిపల్ కమిషనర్ నయిూమ్ అహ్మద్, సీడీపీఓ వెంకటరమణ, ఈఓపీఆర్డీ ప్రసాద్, వీఆర్వోలు, బీఎల్వోలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



ఈవీఎం కేంద్రంలో శిక్షణ ఇస్తున్న ఈఆర్ఓ హరిహరనాథ్

**కొత్త ఓటర్లకు ఈవీఎంలపై అవగాహన..**

ప్రత్తిపాడు: నూతన ఓటర్లుకు ఈవీఎంలపై విస్తృత అవగాహన కల్పించాలని ప్రత్తిపాడు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి. శ్రీకర్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఫిబ్రవరి వరకు ఈవీఎంల పనితీరుపై డెమోనిస్ట్రేషన్ ఉంటుందన్నారు. ఈవీఎం అంటే ఏమిటి? ఎలా పని చేస్తుంది? ఎలా వినియోగించాలి? మనం వేసిన ఓటు సక్రమంగానే మనం నొక్కిన వ్యక్తికి పడుతుందా లేదా? అన్న అనుమానాలు, సందేహాలను నివృత్తి చేసేందుకు గ్రామాల్లోనూ, జనసందోహం ఎక్కువగా ఉన్న ప్రాంతాలు, ఇంజినీరింగ్ కళాశాలల్లో నిర్ణీత షెడ్యూల్ ప్రకారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. ఇప్పటికే ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయంలో స్పెషల్ డెస్క్ ఏర్పాటు చేశామని చెప్పారు.

**తప్పుడు అర్జీలు పెడితే క్రిమినల్ కేసులు..**

ఉన్నవి లేనట్లుగా, బతికి ఉన్నవారిని మరణించినట్లుగా చూపి ఎవ్వరైనా ఓట్ల తొలగింపునకు తప్పుడు అర్జీలను పెడితే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆర్ఓ శ్రీకర్ హెచ్చరించారు. ఓటర్లు ఎవ్వరూ తమ ఓట్లు పోతాయనే అపోహలో ఉండవద్దని, వచ్చిన ప్రతి అర్జీపై ఒకటికి రెండుసార్లు సమగ్ర విచారణ జరిపి నిర్ధారించుకున్న తరువాతే ఓట్ల తొలగింపు ఉంటుందని, అకారణంగా ఏ ఒక్క ఓటూ తొలగించబోమని స్పష్టం చేశారు. స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో నియోజకవర్గ వ్యాప్తంగా మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించి 7500 క్లెయిమ్స్ వచ్చాయని, వాటన్నింటిపై సమగ్ర విచారణ జరుపుతున్నామని చెప్పారు. ఐదవ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తామని తెలిపారు. ఆయా మండలాల తహసీల్దార్లు, అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

### బాజీబాబా దర్గాలో అన్న సంతర్పణ

పెదకాకాని: బాజీబాబా దర్గాలో భక్తులందరికీ మంగళవారం రాత్రి అన్న సంతర్పణ జరిగింది. పెదకాకాని హజరత్ సయ్యద్ బాజీ షహీద్ అవులియా దర్గాకు అమావాస్య రోజున రాష్ట్రవ్యాప్తంగా అధికసంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. వారిలో కొందరు రాత్రిళ్లు దర్గా ప్రాంగణంలోనే నిద్రలు చేసి ఆ తరువాత రోజు ఇళ్లకు బయలు దేరి వెళ్లడం జరుగుతుంది. గతంలో బాజీబాబా దర్గాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య ప్రతి అమావాస్య రోజున రాత్రి సమయంలో దర్గాకు వచ్చిన భక్తులకు భోజనం ఏర్పాటు చేయాలని అందుకు అయ్యే ఖర్చు తానే భరిస్తానని భరోసా ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య సహకారంతో మంగళవారం రాత్రి దర్గా ప్రాంగణంలో భక్తులందరికీ అన్నసంతర్పణ జరిగింది. బాజీబాబా దర్గా ఈఓ షేక్ ముక్తార్ బాషా భోజనం ఏర్పాటు చేయించి ఎమ్మెల్యే పేరిట భక్తులకు పంపిణీ చేశారు. మండల కో-ఆప్షన్ సభ్యుడు షేక్ జాకీర్‌హుస్సేన్, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ సయ్యద్ సుభాని, దర్గా సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



# శివాలయంలో రాహుకేతు పూజలు

కిక్కిరిసిన భక్తులు

పెదకాకాని: పెదకాకాని శ్రీభ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవస్థానంలో మంగళశారం కార్తికమాసం చివరి అమావాస్య సందర్భంగా భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి రాహుకేతు పూజలు పూజలు జరిపించుకున్నారు. ఆలయ అధికారులు భక్తులకు ఏ విధమైన అసౌకర్యం కలగకుండా ప్రత్యేకంగా టెంట్‌లు ఏర్పాటు చేశారు. మంగళవారం ఒక్కరోజు 677 రాహు కేతు పూజా టిక్కెట్లు కొనుగోలు చేసి పూజల్లో పాల్గొన్నారు. ఈ టిక్కెట్ల ద్వారా రూ.3,38,500లు ఆదాయం దేవస్థానానికి సమకూరిందని ఆలయ సహాయ కమిషనర్ నల్వకాల్వ శ్రీనివాసరెడ్డి, పాలక మండలి చైర్మన్ అమ్మిశెట్టి శివ శంకర్‌రావు తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు.



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

**నల్లపాడు అగస్త్యేశ్వరాలయంలో...**

గుంటూరు రూరల్: నల్లపాడు గ్రామంలో వేంచేసియున్న గంగా పార్వతి సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో కార్తిక అమావాస్య పురస్కరించుకుని మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వార్షిక కార్తి అమావాస్య దీపోత్సవంలో గ్రామంలోని మహిళలు అధికసంఖ్యలో పాల్గొని దీపాలంకరణ చేశారు. అమ్మవారికి పుష్పలంకరణ, స్వామివారికి ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయం ముందు దీపాలతో స్వామి అలంకరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు పవన్‌కుమార్ శర్మ, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

**గోరంట్ల వేంకటేశ్వరాలయంలో...**

గోరంట్లలో వేంచేసియున్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి దశావతార కల్యాణ మహోత్సవాలు ఆలయ కమిటీ సభ్యులు, కమిటీ అధ్యక్షుడు గజవల్లి వెంకటప్పారావు నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు చేశారు. స్వామివారికి మత్స్యాయవతారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. స్వామి కల్యాణం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

## నష్టపోయిన ప్రతి రైతునూ ప్రభుత్వం ఆదుకుంటుంది

గార్లపాడు(కాకుమాను): మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో పంట కోల్పోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం అందించే విధంగా తమవంతు కృషి చేస్తామని ఏఓ కె.కిరణ్మయి అన్నారు. మండలంలోని గ్రామాలలో మంగళవారం నుంచి మిచాంగ్ తుఫాన్ కారణంగా నీటమునిగి పంటలను కోల్పోయిన పంటల జాబితా వివరాల సేకరణ కార్యక్రమం మంగళవారం నుంచి ప్రారంభించారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ గ్రామాలలో పంట నష్టపోయిన ప్రతి రైతును గుర్తించి వారి పేరు నమోదు చేసుకుని, నష్టపరిహాన్ని అందిస్తామని ఆమె తెలిపారు. నష్ట పరిహార జాబితాలో ఎలాంటి అవకతవకలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు, పంట నష్టపోయిన రైతులెవరు అధైర్యపడాల్సిన అవసరం లేదని ఆమె తెలిపారు. ఈసందర్భంగా మండలంలోని పలు గ్రామాలలో నీట మునిగిన పంట వివరాలు, రైతుల పేర్లు నమోదు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు నిడుబ్రోలు సుబ్బారావు, ఆయా గ్రామాల రైతులు ఉన్నారు.

చేబ్రోలు: తుఫాన్ ప్రభావంతో పంట దెబ్బతిన్న వివరాలను క్షేత్ర స్థాయిలో గ్రామ సర్వే బృందాలు పంట నష్టపరిహారం అంచనాలను ముమ్మరంగా నమోదు చేస్తున్నారు. కొద్దిరోజుల క్రితం సంభవించిన మిచాంగ్ తుఫాన్ ప్రభావం కారణంగా చేబ్రోలు మండలంలో దెబ్బతిన్న వరి, పత్తి, మిర్చి, కూరగాయ పంటల నష్టం అంచనాలను తయారు చేయటానికి ప్రత్యేక బృందాలను మండలాధికారులు ఏర్పాటు చేశారు. మండల పరిధిలోని 13 గ్రామాల పరిధిలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 15,600 ఎకరాలలో వరి సాగు చేస్తున్నారు. పదిరోజుల్లో ప్రత్యేక బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించి దెబ్బతిన్న పంటలను నమోదు చేయనున్నట్లు మండల ఏఓ బి.శ్రీనివాస నాయక్ మంగళవారం తెలిపారు. నష్టపోయిన పంటల వివరాలను ఇన్పుట్ సబ్సిడీ యాప్‌లో నమోదు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి రైతు వద్ద నుంచి పాసుపుస్తకం, ఆధార్, సెల్ నెంబరు, బ్యాంక్ అకౌంట్‌ల జిరాక్స్ కాపీలను సేకరించాలని ఏఓ తెలిపారు. చేబ్రోలు, మంచాల, నారాకోడూరు గ్రామాల్లో పంట నష్టం నమోదు చేస్తున్న సిబ్బందికి ఏఓ శ్రీనివాస నాయక్ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈవో కె.సునీత, వీఏఏ రమ్య, స్థానిక రైతులు పాల్గొన్నారు.



గార్లపాడులో నీట మునిగిన పంట పొలాలను పరిశీలిస్తున్న ఏఓ కిరణ్మయి, సుబ్బారావు

## 14 నుంచి అష్టోత్తర కుండాత్మక అష్టలక్ష్మి మహాయాగాలు

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని ఇన్నర్ రింగ్ రోడ్డు నందున్న శ్రీ చైతన్య కళాశాల గ్రౌండ్‌లో ఈనెల 14వ తేదీ నుంచి 22 వరకు అష్టలక్ష్మి మహాయాగాలు, లక్ష్మీనారాయణుల కళ్యాణం నిర్వహించనున్నట్లు యాగ కమిటీ నిర్వాహకులు కన్నసాని శ్రీనివాసు తెలిపారు. మంగళవారం ఇన్నర్ రింగ్‌రోడ్డులోని గ్రౌండ్‌లో యాగాల బ్రోచర్స్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ విశ్వగాయత్రి పీఠం ఉపాసకులు వెల్లటూరి ప్రసాదచారి ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 9 రోజులు ప్రతిరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు సుమారు 7 వేలమంది పుణ్య దంపతులతో 108 హోమ గుండాల ద్వారా పూజలు నిర్వహిస్తారన్నారు. 22వ తేదీన ఉదయం మహామంగళ పూర్ణాహుతి, సాయంత్రం కోటి తలంబ్రాలతో లక్ష్మీనారాయణుల కల్యాణం జరుగుతుందన్నారు. గుంటూరు నగర ప్రజలు ఈ పూజా కార్యాక్రమాలలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. నిర్వాహక సభ్యులు ఆలేటి నాగలక్ష్మి, కన్నసాని బాజీ, అడపా ఫణీంద్ర, వేల్పుల కోటేశ్వరరావు, మాజేటి వేణు, హర్షవర్ధన్‌శాస్త్రి, కిషోర్, సుధామాధవి, శ్రీకాంత్ పాల్గొన్నారు.



యాగాల బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న కమిటీ

### బంగారం చోరీ

పట్నంబజారు: నివాసంలో చోరీ ఘటనపై కేసు నమోదైంది. పాతగుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆర్టీసీ కాలనీలో నివాసం ఉండే హసీనా ఈనెల 11వ తేదీ రాత్రి అదే ప్రాంతంలో నివాసం ఉంటున్న ఆమె తల్లి నివాసానికి వెళ్లారు. మంగళవారం ఉదయం తిరిగి ఇంటికి వచ్చేసరికి తలుపులు పగులగొట్టి ఉండటం గమనించింది. ఇంట్లోకి వెళ్లి చూడగా 24 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

గుంటూరు ఈస్ట్: వ్యక్తి కనిపించకుండా పోయిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భారత్‌పేట 8వ లైనుకు చెందిన గడ్డం చందు కృష్ణ రెండు రోజుల క్రితం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతని ఆచూకీ కోసం వెతికి కనిపించకుండాపోయినట్లు నిర్ధారించుకున్న కుటుంబ సభ్యులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### దస్తావేజులు పోయినవి

గుంటూరు జిల్లా, పెదకాకాని మండలం, తక్కెళ్ళపాడు గ్రామం, డోర్ నెం. 2-96 కాపురస్తురాలు అప్పసాని సుబ్బారావు గారి భార్య అప్పసాని రాజ్యలక్ష్మి అను నేను యావన్మందికి తెలియజేయునది ఏమనగా గుంటూరు జి పెదకాకాని స.డి.॥ మిలాకా [illegible] తాలూకు డి.నెం. 192/1కు చెందిన నా యొక్క రిజిష్టర్ విక్రయదస్తావేజు 6672/1980 పోయినది. కావున ఎవరికైన దొరికిన యెడల పై అడ్రసుకు తెచ్చి యివ్వవలసినదిగా లేదా క్రింద ఫోన్ నెంబరుకు తెలియజేయవలసినదిగాను కోరడమైనది.